

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

శనివారం ఆదివారం 16-08-2026 సంపుటి: 02 సంచిక : 106 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday 16-08-2026 Volume :02 Issue: 106 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

## నీటి హక్కుల విషయంలో
# రాజీపడేదే లేదు


### పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..రైతుల కండ్లల్లో ఆనందం చూస్తాం

- విద్యాసూచీలో రాష్ట్రాన్ని 18వ స్థానానికి చేర్చాం
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్
- టీజీఐపాస్ ద్వారా 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గోల్కొండ కోటలో జాతీయ జెండావిష్కరణ

హైదరాబాద్

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతీ నీటి బొట్టునూ సాధించి తీరుతామన్నారు. తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తామని వ్యాఖ్యానించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎంకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

-మిగతా 2 లో








## వందేమాతరం ఆలపించని కేరళ

- కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కేరళలో రాజకీయ వివాదం
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం కేవలం జన గణ మన గీతాన్ని ఆలపించిన ప్రభుత్వం

02



## బడి బాగు చేయ్యండి

- కాక్రోచ్ జనతా పార్టీ కొత్త ఉద్యమం షురూ
- 94 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేత
- త్వరలో ఆసుపత్రులపై ఉద్యమం చేపడతాం
- సిజెపి చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడి

02



## కళ్యాణలక్ష్మి రద్దుకు
# కాంగ్రెస్ కుట్ర

- ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేస్తున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలు
- రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంగా మార్చిన రేవంత్ సర్కారు
- కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రతిపక్షాలు మాత్రమే చెప్పడం లేదనీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే ప్రభుత్వ పెద్దలపై అవినీతిని బట్టబయలు చేసే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో పాలన ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. హైకోర్టు తీర్పు మాటున కళ్యాణలక్ష్మి పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను ఏఐసీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఏటీఎంగా మార్చిందని

-మిగతా 2 లో

- రానున్న 5-7 ఏండ్లలో కీలక లక్ష్యాల సాధనపై మోడీ దృష్టి
- ఆత్మనిర్భర్ భారత్‌తో విదేశీ ఆధారితతకు ముగింపు పలకాలి
- కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాల శిక్షణ ప్రకటించిన ప్రధాని
- సప్తధార విజన్‌తో టెక్నాలజీ, ఆవిష్కరణలకు పెద్దపీట
- సెమీకండక్టర్, అణుశక్తి రంగాల్లో స్వావలంబన దిశగా అడుగులు
- మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు అన్ని పార్టీల మద్దతు కోరిన మోడీ
- స్టార్టప్‌లు, క్వాంటమ్ టెక్నాలజీ, స్పేస్ రంగాల్లో యువతకు కొత్త అవకాశాలు
- దేశ అభివృద్ధికి యువశక్తే అతిపెద్ద లబ్ధిదారులు
- ఎర్రకోట వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో అభివృద్ధి మంత్రం

## వికసిత్ భారత్ కోసం
# సప్తధార విజన్

### 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా సంస్కరణలకు మరింత వేగం

2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు రానున్న 5-7 సంవత్సరాలు అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, దేశ అభివృద్ధి వేగాన్ని మరింత పెంచేందుకు సంస్కరణలు, సాంకేతిక ఆవిష్కరణలు, యువత నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, స్వావలంబన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గత 12 ఏళ్లలో భారత్ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని, కరోనా మహమ్మారి, అంతర్జాతీయ సంక్షోభాలు, యుద్ధాలు వంటి సవాళ్లను అధిగమిస్తూ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. దేశ యువతకు కృత్రిమ మేధ (ఏఐ) సహా అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు ప్రకటించిన మోదీ, 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా', సెమీకండక్టర్ తయారీ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు, అణుశక్తి విస్తరణ వంటి కార్యక్రమాలు దేశ భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. 140 కోట్ల భారతీయుల సంకల్పం, సామర్థ్యమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



02








## కేసీఆర్..సాగుపై
# చర్చకు సిద్ధమా?

- అసెంబ్లీలో చర్చిద్దాం రండీ..రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం
- జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు : ముఖ్యమంత్రి
- సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

“తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నిస్తున్నాయి. ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివి. గత ప్రభుత్వంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్.. తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి సాగు చేశాడు. తాము రైతులకు మేలు చేస్తుంటే ఫామ్‌హౌస్‌లో పడుకుని మాపై విమర్శలు చేస్తున్నాడు. సంగారెడ్డి గడ్డ నుంచి సవాల్ చేస్తున్నా.. రైతులకు తాము చేసిన మేలేంటో... మీరు చేసిన అన్యాయం ఏంటో చర్చించేందుకు అసెంబ్లీకి రండీ” అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చాలెంజ్ చేశారు. -మిగతా 2 లో



## బలపడుతున్న
# ఎల్ నినో

- పసిఫిక్‌లో మారిన వాతావరణం
- ఈ ఏడాది చివరినాటికి పెరుగనున్న తీవ్రత


న్యూఢిల్లీ

పసిఫిక్ మహాసముద్రంలో ఒక శక్తివంతమైన ఎల్ నినో ఘటన రూపుదిద్దుకోవడం కొనసాగుతున్నది. 2026 ద్వితీయార్థం, 2027 ప్రారంభంలో ఇది అత్యంత తీవ్రమైన వాతావరణ ఘటనగా మారడానికి 90 శాతానికి పైగా అవకాశం ఉన్నదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. యూఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) నుంచి వచ్చిన తాజా అంచనా ప్రకారం.. తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉష్ణోగ్రతలు గత నెలలో మరింతగా పెరిగాయి. ఇది ఎల్ నినో బలపడుతున్నదనడానికి ఒక ముఖ్యమైన సంకేతం. భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలోని కొన్ని భాగాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పుడు సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్తలు నివేదించారు. వెచ్చని నీరు సముద్ర ఉపరితలం కింద లోతువరకు విస్తరించి ఉన్నది. ఇది రాబోయే నెలల్లో వాతావరణ సరళి మరింత తీవ్రమవ్వడానికి దోహదపడనున్నది.పసిఫిక్‌వ్యాప్తంగా -మిగతా 2 లో

## వందేమాతరానికి
# ఖర్గే, సోనియా బ్రేక్!

- పార్టీ కార్యాలయంలో వందేమాతరం ఆలాపన.. ఇక ఆపాలని సైగలు: బీజేపీ ఆరోపణ
- ఖర్గేకు కుర్చీ కోసమే ఆ సైగలు: కాంగ్రెస్ సమర్థన

02




# దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానాలి
- సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సంగారెడ్డి,

తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. -మిగతా 2 లో



# బడి బాగు చేయ్యండి

**-కాక్రోచ్ జనతా పార్టీ కొత్త ఉద్యమం షురూ**
**-94 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేత**
**-త్వరలో ఆసుపత్రులపై ఉద్యమం చేపడతాం**
**-సిజెపి చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడి**



ముంబై:
మహారాష్ట్ర, హింగోలి జిల్లాలోని తన స్వగ్రామం సంతుక్ పింప్రి నుంచి స్కూల్ ఠీక్ కరో అనే ఉద్యమాన్ని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు పరిమితి విధించాలని కూడా డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంతుక్ పింప్రిలో జెండా ఎగురవేసే కార్యక్రమంలో పాల్గొన్న దీప్కే అక్కడి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేయడానికి చెక్ లిస్ట్ ఫామ్‌ను తయారు చేశామని, మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా పాఠశాలల నుంచి సమాచారం సేకరించి సంకలనం చేస్తామని చెప్పారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 94 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు. కొత్త పాఠశాలలు తెరవాల్సిన చోట ఉన్నవాటిని మూసివేస్తే దేశం ఎలా బలపడుతుందని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలకు మేలు చేయడం కోసమే ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో లక్ష నుంచి లక్షా యాభై వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, పేద పిల్లలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. కాబట్టి ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు పరిమితి విధించాలని డిమాండ్ చేశారు. సమాన అవకాశాలు లభించే వరకు దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పలేమన్నారు. కొన్ని చోట్ల పాఠశాలలకు చేరుకోవడానికి కూడా మంచి రోడ్లు లేవని విద్యార్థులు చెబుతున్నారని అన్నారు. గ్రామీణ పిల్లలు ఇప్పటికీ కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలకు వెళ్తున్నారని, అక్కడ తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రు ల్లోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని దీప్కే అన్నారు. రోగులు నేలపై పడుకుంటున్నారని, సిటీ స్కాన్ కోసం వారాల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై కూడా త్వరలో ఉద్యమం చేపట్టనున్నామన్నారు. దేశ రాజకీయాలను పట్టణాలకే పరిమితం కానివ్వమని, గ్రామీణ యువత కీలక పాత్ర పోషించడమే లక్ష్యంగా సిజేపీ పనిచేస్తుందని చెప్పారు. కొత్త పార్లమెంటు భవనం, ప్రధానమంత్రి నివాసం నిర్మించుకున్నాం కానీ గ్రామాల్లో పాఠశాలలు ఎందుకు నిర్మించలేకపోతున్నామని ప్రశ్నించారు. రైతులు, కార్మికుల పిల్లలను దేశ భవిష్యత్తుగా భావించడం లేదా అని అడిగారు.

## కళ్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

మొదటి తరువాయి

ఆరోపించారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోడీ సైతం రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో లేదా రాజకీయ వేదికలపై అవినీతి ఆరోపణలు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఈడీ దాడులు నిర్వహించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారో, విచారణ ఎక్కడికి చేరిందో ప్రజలకు స్పష్టత లేదన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షలు లేదా రూ.ఆరు లక్షల సాయం పొందాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది నిబంధనలు, షరతులు విధిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వస్తున్నాయని అన్నారు. సామాన్యుడి అవసరాలను పట్టించుకోకుండా, అధికారంలో ఉన్నవారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజా పాలన కాదన్నారు.

కుటుంబం కోసమే పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి

రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపదేపదే చెప్తున్నారనీ, ఆయన పనిచేస్తున్నది రాష్ట్రం కోసం కాదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుడికి భూములు, కాంట్రాక్టులు, నిధులు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎనుముల తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులకుభూములు ఎలా సమకూర్చాలి, వారికి ఎలా సంపద దోచిపెట్టాలి, కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులకు ఎలా ప్రయోజనాలు కల్పించాలి అన్నదానిపైనే సీఎం దృష్టి ఉందన్నారు. ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో అవినీతి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ పథకాలు, యువత హక్కులు వంటి అన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, గతంలో అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించాలనీ, అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, కుటుంబ ప్రయోజనాలకు పాలనను పరిమితం చేస్తే ప్రజలు తగిన సమయంలో సమాధానం చెప్తారని కేటీఆర్ హెచ్చరించారు.

## కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

మొదటి తరువాయి

శనివారం సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన సభలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని హితవు పలికారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా రూ.12 వేల చొప్పున రూ.36 వేల కోట్లను70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికల్లో అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతాంగం అని చెప్పింది వాస్తవం కాదా..? బీజేపీ నాయకులు అది చదువుకుంటే కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది కదా? అని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లను నేను అడుగుతున్న.. మోడీ పన్నెండేండ్లు .. రాష్ట్రంలో కేసీఆర్ పదేండ్లు అధికారంలో ఉండి పేదవాడికి సన్నబియ్యం ఇయ్యాలని, చంటి పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టాలని ఏనాడైన ఆలోచించారా? అని ప్రశ్నించారు.

## బలపడుతున్న ఎల్ నినో

మొదటి తరువాయి

వాతావరణ సరళులు ఇప్పటికే ఎల్ నినో ప్రభావానికి స్పష్టమైన సంకేతాలను చూపుతున్నాయి. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో వర్షపాతం పెరిగింది. అయితే ఇండోనేషియా వంటి ప్రాంతాలు సాధారణం కంటే పొడి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఎల్ నినో మరొక లక్షణమైన ఉష్ణమండల ప్రాంతాల్లో గాలుల తీరులో మార్పులు కూడా మరింత స్పష్టంగా మారాయి. ఎన్‌వోఏఏ, అంతర్జాతీయ అంచనా సంస్థలు ఉపయోగించే వాతావరణ నమూనాలు ఈ ఘటన 2026 చివరివరకు బలపడటం కొనసాగే అవకాశం ఉన్నదని సూచిస్తున్నాయి. 1950లో ఆధునిక పరిశీలనలు ప్రారంభమైనప్పటి నుంచి నమోదైన అత్యంత బలమైన ఎల్ నినోల్లో కొన్నింటితో పోటీపడే లేదా వాటిని మించిపోయేలా ప్రస్తుత ఎల్ నినో ఒక చారిత్రాత్మక ఘటనగా మారడానికి 69 శాతం అవకాశం ఉన్నదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదేగనుక జరిగితే ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిపై గణనీయమైన ప్రభావాన్ని చూపిన ప్రధాన ఎల్ నినో ఘట్టాల సరసన ఈ ఘటన నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు, ముఖ్యంగా ఎల్ నినో రుతుపవనాల వర్షపాతం, ఉష్ణోగ్రతలను ప్రభావితం చేసే దేశాల్లో, ఈ పరిణామాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. సెప్టెంబర్‌లో తదుపరి సమాచారం వెలువడే అవకాశం ఉన్నది.

# వికసిత్ భారత్ కోసం సప్తధార విజన్

- రానున్న 5-7 ఏండ్లలో కీలక లక్ష్యాల సాధనపై మోడీ దృష్టి
- ఆత్మనిర్భర్ భారత్‌తో విదేశీ ఆధారితతకు ముగింపు పలకాలి
- కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాల శిక్షణ ప్రకటించిన ప్రధాని
- సప్తధార విజన్‌తో టెక్నాలజీ, ఆవిష్కరణలకు పెద్దపీట
- సెమీకండక్టర్, అణుశక్తి రంగాల్లో స్వావలంబన దిశగా అడుగులు
- మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు అన్ని పార్టీల మద్దతు కోరిన మోడీ
- స్టార్టప్‌లు, క్వాంటమ్ టెక్నాలజీ, స్పేస్ రంగాల్లో యువతకు కొత్త అవకాశాలు
- దేశ అభివృద్ధికి యువశక్తే అతిపెద్ద లబ్ధిదారులు
- ఎర్రకోట వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో అభివృద్ధి మంత్రం



న్యూఢిల్లీ బ్యూరో
దేశంలో రానున్న 5-7 ఏండ్లలో లక్ష్యాలు పూర్తి చేయాల్సి ఉందని, ఆ లక్ష్యాల సాధనకు సంస్కరణలు మరింత వేగం చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ వరుసగా 13వ సారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత ఎర్రకోటపై వందేమాతర గేయాన్ని వినిపించారు. ఆర్మీ బ్యాండ్‌తో వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గేయం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత మొదటిసారి పూర్తిగా వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. అనంతరం దేశప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు.

దేశవ్యాప్తంగా 'వందేమాతరం' నినాదం మార్మోగుతోందని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత 12 ఏండ్లలో దేశం అనేక రంగాల్లో గణనీయమైన మార్పును సాధించిందని చెప్పారు. గత 5-7 దశాబ్దాల్లో సాధించలేక పోయిన లక్ష్యాలను రానున్న 5-7 ఏండ్లలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలోచనా విధానంలోనూ, లక్ష్యాల సాధనలోనూ సంస్కరణలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని వివరించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం, సామర్థ్యమే దేశానికి అతిపెద్ద బలమని అన్నారు. కరోనా మహమ్మారి, యుద్ధాలు, అంతర్జాతీయ అనిశ్చితి వంటి అనేక సవాళ్లు ఎదురైనా భారత్ తన అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించిందని మోడీ తెలిపారు. ఒకప్పుడు 'ఫ్రాజైల్ ఫైవ్' దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇప్పుడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. ?డీలిమిటేషన్‌తో లింకున్న మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసేలా మద్దతు ఇవ్వాలనీ, ఆ తరువాత ఆ అంశంలో క్రెడిట్ తీసుకోవాలని ప్రతిపక్షాలను ప్రధాని మోడీ కోరారు. రాజ్యాంగ సవరణకు ఆమోదం తెలిపి, రాజకీయ పార్టీలు దానికి క్రెడిట్ తీసుకోవచ్చు అన్నారు. అసెంబ్లీలు, లోక్‌సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలను గౌరవించాలన్నారు.

కోటి మంది యువతకు ఏఐ స్కిల్స్

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ప్రధాని మోడీ అన్నారు. దేశ అభివృద్ధికి యువతే అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారని వివరించారు. వికసిత్ భారత్ కోసం సప్తధార ప్రణాళికను ప్రధాని మోడీ ప్రకటించారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "భారత్‌లో ప్రస్తుతం సుమారు రెండున్నర లక్షల స్టార్టప్‌లు ఉన్నాయి. ఇటీవల తమ ప్రభుత్వం ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహించింది. ఏఐ పరిధి చాలా త్వరగా విస్తరిస్తోంది. ఎర్రకోట నుంచి దేశ యువతకు ఓ ప్రకటన చేస్తున్నాను. రాబోయే సంవత్సర కాలంలో దేశంలోని కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాన్ని నేర్పించనున్నాం. ఏఐ ప్రపంచంలో ఆ యువతను బలోపేతం చేయనున్నాం. సప్త ధార విజన్‌లో భాగంగా టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను మూడో శక్తిగా పరిగణిస్తున్నాం. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, స్పేస్, రోబోటిక్స్, డేటా సెంటర్ల రంగం వేగంగా విస్తరిస్తోంది. కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు ట్రైనింగ్ ఇవ్వనున్నాం" అని అన్నారు.

'ఆత్మనిర్భర్ భారత్' కీలకం

దేశం స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంత సామర్థ్యాలను పెంచుకోవడం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడంతో 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. భారత్ ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడాలని మోడీ స్పష్టం చేశారు. 'మేకిన్ ఇండియా', 'స్వదేశీ', 'లోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాలకు ప్రజలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు.

సెమీకండక్టర్ రంగంలో స్వావలంబనకు అడుగులు

సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన సాధించేందుకు భారత్ కీలక అడుగులు వేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతకు అణుశక్తి కీలకమని పేర్కొన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. 2014 నుంచి దాదాపు 40 దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, వాణిజ్య భాగస్వామ్యాలు కుదుర్చుకుందని తెలిపారు. ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందాలతో దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భారీ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. గత 12 ఏండ్లలో రక్షణ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి దాదాపు ఐదు రెట్లు పెరిగిందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలోనూ భారీ వృద్ధి సాధించామని చెప్పారు.

# నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదు

మొదటి తరువాయి

సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి... రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తమ 32 నెలల పరిపాలనలోసాధించిన విజయాలు, అమలు చేసిన పథకాలు, వాటి ఫలితాలను ఆయన సోదాహరణంగా ఏకరువు పెట్టారు. 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,932 (దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికం)గా ఉండటాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలమని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి సాగు, విస్తీర్ణంలో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు.

విద్యాసూచీలో 18వ స్థానం విద్యారంగంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వందకుపైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. వీటిలో ఇప్పటికే 105 స్కూళ్లను మంజూరు చేశామనీ, 84 బడులకు అనుమతులిచ్చామని వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామనీ, డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 212 శాతం పెంచామని గుర్తు చేశారు. దాదాపు 22 లక్షల మంది పిల్లలకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందిస్తున్నట్టు తెలిపారు. జూనియర్ కాలేజీల్లో సైతం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు వివరించారు. 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయిబర్స్ మెంట్ ను వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు.

ఆ మాణిక్యాల కోసం సీఎం కప్

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే క్రీడా విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు గచ్చిబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేశామని అన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ ను నిర్వహించినట్టు వివరించారు. త్వరలో తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ -2026'ను నిర్వహించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. యువతకు విద్యతో పాటు నైపుణ్య కోర్సుల్లో శిక్షణను అందిస్తూ ఉద్యోగవకాశాలను పెంచామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామనీ, టీజీపీఎస్సీ ద్వారా 456, పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా 7,435 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తమదనీ, చదువుకుని ఉద్యోగాలు దక్కించుకోవాల్సిన బాధ్యత యువతదని సూచించారు. ఇతర వ్యాపకాల వైపు మళ్లకుండా పరీక్షలకు సిద్ధపడాలని విద్యార్థులను కోరారు.

వెల్లువలా పెట్టుబడులు... ?

టీజీఐపాస్ ద్వారా ఇప్పటికే రూ.1.29 లక్షల పెట్టుబడులు సాధించామనీ, వీటితో 78 వేలకు పైగా ఉద్యోగవకాశాలు రాబోతున్నాయని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరినట్టు చెప్పారు. 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయనీ, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని తెలిపారు. హైదరాబాద్ లో ఇప్పటికే 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ఉన్నాయనీ, 2026లో కొత్తగా 40 సెంటర్లు వచ్చాయని తెలిపారు. దీంతో రాష్ట్రం పెట్టుబడులకు చిరునామాగా మారుతున్నదని సీఎం హర్షం వ్యక్తం చేశారు.

2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు

2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు, ఆర్థిక సాయాల కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలను అందించామన్నారు. వడ్డీ లేని రుణాల కింద రూ.1,900 కోట్ల రాయితీని విడుదల చేసినట్టు తెలిపారు. మహిళలను పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా మార్చామన్నారు.

## వందేమాతరానికి ఖర్గే, సోనియా బ్రేక్!

**-పార్టీ కార్యాలయంలో వందేమాతరం ఆలాపన.. ఇక ఆపాలని సైగలు: బీజేపీ ఆరోపణ**
**-ఖర్గేకు కుర్చీ కోసమే ఆ సైగలు: కాంగ్రెస్ సమర్థన**



న్యూఢిల్లీ:
శనివార మిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకల్లో వందేమాతరం పూర్తి గీతం ఆలపించినప్పుడు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ సైగలు చేసినట్లు కనిపించిన వీడియో వైరల్ అయింది. దీనిపై బీజేపీ ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ స్పందించింది. వీడియోలో వందేమాతరం ఆలాపన కొనసాగుతుండగా సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చుట్టూ ఉన్నవారి వైపు చేతిసైగలు చేస్తున్నట్లు కనిపించారు. రాహుల్ గాంధీ కూడా అలాంటి సైగ చేసినట్లు కనిపించారు. బీజేపీ వీడియోను పంచుకుని సోనియా గాంధీ పూర్తి వందేమాతరం ఆలాపనను ఆపాలని అడిగారని ఆరోపించింది. ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ఇలా చేశారని బీజేపీ నాయకులు విమర్శించారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ ఖండించింది. దీనిపై పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ ఇందిరా భవన్ లో వందేమాతరం పూర్తి గీతం ఆలపించారు. దాన్ని ఆపడానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చాలా సేపు నిలబడి ఉన్నందున సోనియా గాంధీ ఆయనకు కుర్చీ తీసుకురావాలని అడిగారు. ఆ సైగలకు వందేమాతరంతో ఎలాంటి సంబంధం లేదు. సోనియా గాంధీ కూడా గీతం ఆలపిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ ఇందులో ఎలాంటి వివాదం లేదు. పార్టీ సంప్రదాయం ప్రకారం గతంలో మొదటి రెండు చరణాలు మాత్రమే ఆలపించేవారు. అయితే ఈసారి పూర్తి గీతం ఆలపించారు అని తెలిపారు.

## దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

మొదటి తరువాయి

మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు.

## వందేమాతరం ఆలపించని కేరళ

**-కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు**
**-స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కేరళలో రాజకీయ వివాదం**
**-స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం కేవలం జన గణ మన గీతాన్ని ఆలపించిన ప్రభుత్వం**




**తిరువనంతపురం**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేరళలో రాజకీయ వివాదానికి దారి తీశాయి. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త ప్రోటోకాల్‌కు భిన్నంగా కేరళ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరాయి విజయన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జన గణ మన గీతాన్ని ఆలపించారు. అయితే, ఈ అధికారిక రాష్ట్ర వేడుకలో వందేమాతరం గేయాన్ని మాత్రం ఆలపించలేదు. దీంతో ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందే కేరళ ప్రభుత్వ వైఖరిపై ఆసక్తికర పరిణామాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం, వందేమాతరం గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపిస్తారా? అని ప్రశ్నించగా, అందుకు సూటిగా సమాధానం ఇవ్వడానికి పినరాయి నిరాకరించారు. 'వేచి చూడండి' అని సమాధానం ఇచ్చారు. అంతే కాదు, ఈ విషయంపై కాంగ్రెస్, యూడీఎఫ్ కు స్పష్టమైన వైఖరి ఉందని కూడా తెలిపారు. తీరా స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరాన్ని పక్కనబెట్టడం రాజకీయంగా చర్చ నీయాంశమైంది. మరోవైపు, కేరళ విద్యాశాఖ కూడా రాష్ట్రంలోని పాఠశాలల్లో జెండా ఎగురవేసి కేవలం 'జనగణమన' పాడాలని ఆదేశించింది తప్ప, వందేమాతరం పాడాలని ఎలాంటి సూచనలు చేయలేదు. ఈ విస్మరణ రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**మిడ్జిల్, ఆగస్టు 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లాబ్యూరో ):** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయం పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు. జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు జాతీయ జెండాకు అభివందనం చేసి, జాతీయ గీతాన్ని ఆలపించి, పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను తిలకించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారులు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు వివరించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను వీక్షించారు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖల సేవలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన పోలీసు పరేడ్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తదనంతరం మంత్రివర్యులు. జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలను అందజేశారు.

# రామ్ నుంతల ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ఆమనగల్లు, ఆగస్టు15 (నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని రామ్నుంతల గ్రామపంచాయతీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారత దేశ 80 వ స్వాతంత్ర దినోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే గ్రామంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు,రామ్ నుంతల గ్రామ సర్పంచ్ వర్త్యావత్ శ్రీను నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.శ్రీను నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల వల్లనే స్వాతంత్రం సిద్ధించిందని ఆయన అన్నారు. దేశం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరులను గుర్తు చేసుకోవడం,వారికి అర్పించే సముచితమైన నివ నివాలని సర్పంచ్ శ్రీను నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం,గ్రామ అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు,ప్రజా ప్రతినిధులు,మహిళా సంఘాలు,యువకులు, మరియు గ్రామ పెద్దలు, విద్యార్థులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గీత కార్మికులకు ఉచితంగా ఈత,ఖర్జూర మొక్కలు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్




**ఆమనగల్లు, ఆగస్టు15 (నేటి దర్శిని);** ఆమనగల్లు పరిధిలోని ఆమనగల్,కడ్తాల్, మాడుగుల మండలాల్లో వనవాసం కార్యక్రమం లో భాగంగా గీత కార్మికులకు ఉచితంగా ఈత,ఖర్జూర మొక్కలను అందిస్తున్నట్లు సిఐ బద్యనాథ్ చోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గీత కార్మికుల సొసైటీలకు ఉత్సాహం ఉండి ఈత,ఖర్జూర వనాలు పెంచుకునే వారికి ప్రభుత్వం తరఫున ఉచిత మొక్కలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు స్టేషన్ పరిధిలో ఈత మొక్కలు 9000, ఖర్జూరం మొక్కలు 8000 అందుబాటులో ఉన్నాయన్నారు. గౌడ కులస్తులు గీత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఐ పేర్కొన్నారు. అవసరం ఉన్న ఇతర రైతులు కూడా పట్టా పాస్ బుక్ జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చి మొక్కలను తీసుకువెళ్లవచ్చని సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు.

# నందికొండలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

- పాల్గొన్న జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**నందికొండ,ఆగస్టు15(నేటి దర్శిని):** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూచించినట్లుగా కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా




కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నాగార్జునసాగర్ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ చరక్ చంద్ర పవర్, ఉన్నతాధికారులు, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మండలాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్, చైర్మన్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో దేశభక్తి చాటిన జెండా ఆవిష్కరణ

- యంగ్ వండర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం



**చింతపల్లి, ఆగస్టు 15 నేటి దర్శిని :** చింతపల్లి మండల కేంద్రంలో యంగ్ వండర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహుజన్ సమాజ్ పార్టీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్ నల్ల ప్రసాద్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నల్ల ప్రసాద్ మాట్లాడుతూ యువత దేశభక్తి, సేవా భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం యువతతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్ల ఆంజనేయులు, అజయ్, సైదులు, సాయికిరణ్, మహేష్, సన్నీ, హరీష్, వంశీ, నరసింహ, సాయి, శ్రీను, సిరాజ్, పెంటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు. యువత ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.

# ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం

- పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి దంపతులు

**మిడ్జిల్, ఆగస్టు 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మరియు నర్వ మాజీ సర్పంచ్ శ్రీమతి బంగ్లా స్వాతి లక్ష్మికాంత్ రెడ్డి దంపతులు పాల్గొని దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన మన భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాజ్యాంగ స్ఫూర్తితో, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో "వికసిత్ భారత్" వైపు అడుగులు వేస్తూ, దేశ సమగ్రతను, సంస్కృతిని కాపాడుకుందామని,దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ అభినందనలు తెలియజేసారు.



# తలకొండపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**తలకొండపల్లి, ఆగస్టు 15, ( నేటి దర్శిని ):** తలకొండపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ కే. రమేష్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ జెండాకు అభివందనం చేశారు. అనంతరం తహసిల్దార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని, యువత దేశాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.టి. శ్రీ రాజశేఖర్ రెడ్డి,వివిధ పార్టీల నాయకులు, యువకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన మహిళా జర్నలిస్ట్

- హబ్సిగూడ పన్నీర్ వ్యవహారంపై న్యాయం చేయాలని వేడుకోలు
- మాఫియా దాడి చేసిందని ఫిర్యాదు చేసిన పట్టించుకోని పోలీసులు
- కల్తీని వెలుగులోకి తెస్తే జర్నలిస్టులదే నేరమా.?
- అక్రమాలు చేసిన వాళ్లు హాయిగా తిరిగే స్వేచ్ఛ ఉంటే అక్రమాలు ఆగేది ఎలా.?
- ఉన్నత అధికారులు ఉక్కుపాదం అంటారు, కిందిస్థాయి అధికారులు రెడ్ కార్పెట్ వేస్తే ఉక్కుపాదం సాధ్యమేనా.?


మహిళా జర్నలిస్టుపై దాడికి తెగపడ్డ దృశ్యం


మహిళ జర్నలిస్టు నుండి దౌర్జన్యంగా ఫోన్ లాక్కున్న దృశ్యం




**హైదరాబాద్,ఆగస్టు15(నేటి దర్శిని):** కల్తీ ఆహార పదార్థాల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన మహిళా జర్నలిస్టుపై దాడి జరిగిందని, అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులను ఆశ్రయించినా తగిన న్యాయం జరగలేదని ఆరోపిస్తూ బాధిత మహిళ జర్నలిస్టు మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లో పన్నీర్ ప్యాకింగ్‌కు సంబంధించిన వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమయంలో తమపై దాడి జరిగిందని, దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ ఓయూ పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**కల్తీని అడ్డుకోవడం నేరమా.?**

ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే కల్తీ ఆహార పదార్థాలపై సమాచారం సేకరించి, కన్ఫర్మేషన్ చేసుకొని, సంబంధిత అధికారులకు తెలియజేయడం జర్నలిస్టుల బాధ్యత కాదా.? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు డిజిపి, కమిషనర్లు, ఉన్నత అధికారులు కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తుండగా, మరోవైపు అదే అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కేసులు నమోదవుతున్నాయనే ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

**దాడి చేసిన వారెవరు.? కేసులు ఎవరిపై.?**

తమపై దాడి చేసిన ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని, ఆ వీడియోలను పరిశీలిస్తే అసలు ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది స్పష్టమవుతుందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. మాఫియా కు సంబంధించిన వాళ్లు తమపై దాడి చేసి, మహిళా జర్నలిస్టుపై దాడితో పాటు సెల్ఫోన్ లాక్కొని, అత్యంత అసభ్య పదజాలాలతో దూషించి వారిని అక్కడి నుండి తోసివేసిన దృశ్యాలు వీడియోలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ దాడికి గురైన తమ ఫిర్యాదు, అందుబాటులో ఉన్న వీడియో ఆధారాలు, ఇతర వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే జర్నలిస్టులపైనే ఆగమేఘాల మీద కేసులు పెట్టడం ఏ విధమైన న్యాయమని ప్రశ్నిస్తున్నారు.

**అక్రమార్కులకు అండగా మారుతుందా.?**

కల్తీ ఆహార పదార్థాలపై సమాచారం ఇచ్చేవారిని, వాటిని వెలుగులోకి తీసుకువచ్చేవారిని అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తే మాఫియాలకు, అక్రమార్కులకు మరింత ధైర్యం చేకూరే ప్రమాదం ఉందని దీనిపై వెంటనే హైదరాబాద్ సిపి, డిజిపి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే అక్రమాలు చేసే మాఫియాలు మరింత రిచిపోయే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. జర్నలిస్టులపై విచారణ చేయకుండా ఆగమేఘాల మీద కేసులు పెట్టడం కొనసాగితే భవిష్యత్తులో కల్తీ వ్యాపారాలపై సమాచారం బయటకు తీసుకురావడానికి ఎవరు ముందుకు వస్తారో ఉన్నత అధికారులు, ప్రభుత్వమే ఆలోచించాలి.

**పైస్థాయిలో ఉక్కుపాదం.. కిందిస్థాయిలో రెడ్‌కార్పెట్.?**

హైదరాబాద్‌లో కల్తీ ఆహార పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు పదేపదే హెచ్చరిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఎందుకు కనిపిస్తున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు విరుద్ధంగా, విలువ ఇవ్వకుండా కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కల్తీ ఆహార మాఫియాను ఎలా కట్టడి చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

**డీజీపీ,హైదరాబాద్ సీపీ జోక్యం చేసుకోవాలి**

హబ్సిగూడ లో జర్నలిస్టులపై పన్నీర్ మాఫియా దాడి ఘటనపై డీజీపీ, హైదరాబాద్ సీపీ పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. దాడి ఘటన, పోలీసులకు చేసిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న వీడియోలు తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారెవరైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులపై నమోదైన కేసులను కూడా నిష్పక్షపాతంగా పునఃపరిశీలించాలని కోరుతున్నారు.

**మానవహక్కుల కమిషన్‌కు కీలక విజ్ఞప్తి**

తమ హక్కులకు భంగం కలిగిందని ఆరోపిస్తూ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన జర్నలిస్టులు తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**మనవ హక్కుల కమిషన్ లో ఏ శాఖపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి.?**

మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించే బాధితుల్లో ఏ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయో ప్రభుత్వం విశ్లేషించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల నేతలు సూచించారు. ఒకే శాఖపై పదేపదే ఫిర్యాదులు వస్తున్నట్లయితే ఆ శాఖ పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి లోపాలను సరిదిద్దాలని కోరారు.

కల్తీ ఆహారం ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశమని, దానిపై సమాచారం ఇచ్చే వ్యక్తులపై దాడి చేసి, భయపెట్టే వాతావరణం ఏర్పడితే ప్రజారోగ్యమే ప్రమాదంలో పడుతుందని జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు.

> **కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి.. జర్నలిస్టులపై కాదు**
>
> **అవినీతి,అక్రమార్కులపై చట్టం తన పని చేయాలే తప్ప, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెచ్చిన వారిని నిందితులుగా నిలబెట్టకూడదని ప్రజలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.**

## నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపులను ప్రారంభించిన జిల్లా మంత్రి

- పాల్గొన్న నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి



**నల్గొండ, ఆగస్టు15 (నేటి దర్శిని):** నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డు నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును తెలంగాణ రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మరియు సినీ ఆటోగ్రాఫ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో చైతన్యవంతులు చేసి ఆర్థిక స్వాలంబన తెలంగాణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ చంద్రశేఖర్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పటాన్ చెరు ఆగస్టు 15 (నేటి దర్శిని)** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులను స్మరించుకున్నారు. అనంతరం వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం కలిసికట్టుగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పలు జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఇస్నాపూర్ 18వ వార్డు కౌన్సిలర్ మన్నె రాఘవేందర్, 17వ వార్డు కౌన్సిలర్ వెంకట్ నాయక్,గడ్డం అరవింద్, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో 800 మందికి అల్పాహారం






**ఎల్.బి.నగర్,ఆగస్టు 15, (నేటి దర్శిని):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులకు కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా అల్పాహారం స్వీకరిస్తూ "భారత్ మాతా కీ జై" అంటూ దేశభక్తి నినాదాలు చేశారు. దేశభక్తితో పాటు సేవాభావాన్ని పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపింది. కార్యక్రమానికి హాజరైన కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్ ఆత్మీయంగా స్వాగతించారు. విద్యార్థులకు అల్పాహారం అందించి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సమితి సభ్యులను అభినందించారు. దేశభక్తి, సేవాభావం, మానవతా విలువలను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల సమితి సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. "సేవా పరమో ధర్మః -- మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# చింతపల్లి మండల కేంద్రంలో మువ్వన్నెల రెపరెపలు




- **ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.**

**చింతపల్లి ఆగస్టు 15 నేటి దర్శిని :** చింతపల్లి మండలవ్యాప్తంగా శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.

**జాతీయ పతాకాలతో దేశభక్తి చాటుకున్న అధికారులు**

తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో సుజాత, ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి, వైద్యాధికారి శ్రీదేవి, ఎంఈఓ నీరుడు అంజయ్య, పశువైద్యాధికారి భాను నాయక్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ, సీడీపీవో సక్కుబాయి తదితరులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

చింతపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్ పాలకవర్గంతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచులు జెండాలను ఎగురవేశారు.

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అదుర్స్**

పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. యువత, విద్యార్థులు త్రివర్ణ పతాకాలు చేతబూని 'భారత్ మాతా కీ జై' నినాదాలతో తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

**అమరవీరులకు ఘన నివాళి**

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

**దేశభక్తి నినాదాలతో మార్మోగిన చింతపల్లి.. మువ్వన్నెల జెండాలతో పండుగ వాతావరణం**

## తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జ్ మేడి నరేష్



**నకిరేకల్ ఆగస్టు15(నేటి దర్శిని):** శ్రీ తెలంగాణ రక్షణ సేన పార్టీ నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జ్ మేడి నరేష్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. జాతీయ పతాకాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత, విద్యార్థినిలు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలని నినాదాలు ఇస్తూ, మహనీయుల ఆశయాలను సాధించాలని , మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారినీ స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ తెలంగాణ మాధవక్క మరియు మండల నాయకులు వనపర్తి సతీష్, గిరి ప్రసాద్, మహేష్, మోక్ష, అనూష, ప్రసన్న, శ్వేతా, నిహారిక, వంశీ, అభిజిత్, సాయి,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కోర్టు భవన నిర్మాణ ఏర్పాటుకు కృషి

● రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్




**ఆమనగల్లు,ఆగస్టు15 (నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణంలో నూతన కోర్టు భవన నిర్మాణ ఏర్పాటుకు కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ అన్నారు.

శనివారం ఆమనగల్లు లో జూనియర్ సివిల్ జడ్జి ఆవరణలో స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ , స్పెషల్ ఫోక్సో ఏడీజే జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్,ఫోర్త్ ఏడీజే జిల్లా న్యాయమూర్తి జయరాం రెడ్డి హాజరయ్యారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. అదేవిధంగా ఆమనగల్లు జూనియర్ నూతన భవనం కోర్టు ఏర్పాటు కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ కుమార్, న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్,సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ,మల్లేపల్లి జగన్,ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ,పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్,శేఖర్,మధు గౌడ్,విజయ్ కుమార్ గౌడ్,మల్లేష్,గణేష్ గౌడ్, సంతోష్ కుమార్,శిరీష్,దేవేందర్ గౌడ్,సర్దార్ నాయక్,న్యాయవాదులు జగన్ గౌడ్,రామకృష్ణ,కొప్పు కృష్ణ,మల్లేష్,ఆంజనేయులు,బీక్య నాయక్,శిరీష్,రమేష్, శివ,శ్రీనివాస్,ప్రభు నాయక్, శ్రీశైలం,రామ చంద్రయ్య, లక్ష్మణ్,శివశంకర్, మహేశ్వర్,అజయ్ కుమార్, నరేందర్,శిరీష,శైలజ, మమత తదితరులు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

● జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన

● మహబూబ్ నగర్‌జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్





**మిడ్జిల్, ఆగస్టు 15, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జోన్–VII జోగులాంబ డీఐజీ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం మరియు ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజానికి సవాల్‌గా మారుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును, కుటుంబాల భద్రతను, సమాజ ప్రగతిని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రజలు మరియు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సహకారంతో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వంటి సామాజిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని, సురక్షితమైన మరియు నేర రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, AO రుక్మిణీ బాయి, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ పోగ్రామ్ ఆఫీసర్ అవార్డు పొందిన వైద్య అధికారి డాక్టర్ శివకాంత్



**మిడ్జిల్, ఆగస్టు 15, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 2 అవార్డు ఆగస్టు 15 సందర్భంగా. జిల్లా ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా వైద్య అధికారి డా.శివకాంత్ . ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ మహిళా,.పారిజాత. వస్పుల మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్, మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ జిల్లా కేంద్ర లో అవార్డులు అందజేశారు, మిడ్జిల్ మండల ఆరోగ్య సిబ్బంది అయ్యుభ్ ఖాన్ సంపత్ కుమార్. జంగయ్య. దేవయ్య. హర్షం వ్యక్తం చేశారు.

## తలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు

● ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్



**ఉప్పల వెంకటేష్ తలకొండపల్లి, ఆగస్టు 15, (నేటి దర్శిని):** 80వ భారత స్వతంత్ర దినోత్సవ సందర్భంగా తలకొండపల్లి మండల కేంద్రంలోని ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాలడ కళాశాల నందు ఎంతో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించటంతో పాటు బాలికల యొక్క ప్రభాతభేరి మరియు వారి యొక్క నృత్యాలు దేశభక్తిని చాటే విధంగా ఉన్నాయని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉప్పల అఖిల్ , పాఠశాల ప్రిన్సిపల్ పరమేశ్వరి , పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పెద్దలు పాల్గొనడం జరిగింది.

## తలకొండపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**తలకొండపల్లి, ఆగస్టు 15, ( నేటి దర్శిని ):** తలకొండపల్లి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ ఓ . రేణుక జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ జెండాకు అభివందనం చేశారు. అనంతరం ఎస్ఓ రేణుక మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని, యువత దేశాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో , విద్యార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల కోసం డిమాండ్ చేస్తే అరెస్టులా?

● పేదలకు ఇళ్లు అడిగితే అరెస్టులా?
● లాటరీ లబ్ధిదారుల పేర్లు గల్లంతు
● కార్పొరేటర్లపై సీపీఎం తీవ్ర ఆరోపణలు
● ముందస్తు అరెస్టులపై కమ్యూనిస్టుల ఆగ్రహం
● ప్రజాస్వామ్య హక్కులు కాపాడాలని డిమాండ్





**నల్లగొండ, ఆగస్టు 15 (నేటి దర్శిని):** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసిన సీపీఎం నాయకులను స్వాతంత్ర్య దినోత్సవం రోజున నల్లగొండలోని సీపీఎం కార్యాలయంలో పోలీసులు అరెస్టు చేయడంపై ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలని కోరడమే నేరమా? అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజునే ప్రజల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కులను పోలీసులు కాలరాస్తున్నారని మండిపడ్డారు.

**లాటరీలో ఇళ్లు దక్కినవారికి అన్యాయం?**

నల్లగొండ పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ సీపీఎం నాయకులు ఆరోపించారు. గతంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన లాటరీలో ఇళ్లు దక్కిన కొందరి పేర్లు ప్రస్తుతం జాబితా నుంచి గల్లంతయ్యాయని పేర్కొన్నారు.

**కార్పొరేటర్లపై తీవ్ర ఆరోపణలు**

గల్లంతైన పేర్ల స్థానంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు తమకు అనుకూలమైన పేర్లను చేర్చేందుకు ప్రయత్నించారని సీపీఎం నేతలు ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**అర్హులకే ఇళ్లు ఇవ్వాలి**

గతంలో పారదర్శకంగా లాటరీ విధానంలో ఇళ్లు పొందిన లబ్ధిదారులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. పేదల హక్కులను హరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు.

**ముందస్తు అరెస్టులపై సీపీఎం ఆగ్రహం**

ఇళ్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా కమ్యూనిస్టు నేతలను ముందస్తుగా అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం నేతలు మండిపడ్డారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

**ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి**

ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే హక్కును హరించవద్దని సీపీఎం నాయకులు కోరారు. పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, సీపీఎం నేతల అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు.

# ప్రశాంతపురి తండా లో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి భూమిపూజ

● భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**చింతపల్లి, ఆగస్టు 15 నేటి దర్శిని :** నల్గొండ జిల్లా చింతపల్లి మండలం ప్రశాంతపురి గ్రామంలోని శ్రీ జగదాంబ మాత, సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8:45 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కేతావత్ గోవర్ధన్ నాయక్, వైస్ చైర్మన్ కేతావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, కాంగ్రెస్ చింతపల్లి మండల అధ్యక్షులు జటావత్ హరి నాయక్, సర్పంచ్ కేతావత్ శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ కేతావత్ బంగారి జగన్నాయక్, ఉపసర్పంచ్ జ్యోతి రవి నాయక్, మాజీ ఉపసర్పంచ్ పరమేష్, కమిటీ సభ్యులు విస్లావత్ రామచందర్ నాయక్, కేతావత్ నారాయణ, కేతావత్ జైపాల్ నాయక్, కేతావత్ శ్రీను, కేతావత్ కిషన్ నాయక్, బాణావత్ రూప్ సింగ్, వార్డు సభ్యులు కేతావత్ బాల్‌సింగ్, కేతావత్ సంతోష్, కేతావత్ లచ్చిరాం, లక్ష్మీ నర్సింహా, ఇస్లావత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ మండలంలో అంబరాన్ని తాకిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు


డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన సేవా సమితి భవనం ఆవరణలో


వాడియాల గ్రామపంచాయతీ ఆవరణలో


మిడ్జిల్ గ్రామపంచాయతీ ఆవరణలో


మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి


మండల తాసిల్దార్ కార్యాలయంలో


చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్గం నాగరాజ్ గౌడ్

**మిడ్జిల్, ఆగస్టు 15, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అంబరాన్ని తాకాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడగా, దేశభక్తి భావం వెల్లివిరిసింది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల విద్యార్థులు, యువత, ప్రజలతో దేశభక్తి ర్యాలీలు చేపట్టారు. జైహింద్, భారత్ మాతాకీ జై నినాదాలతో వీధులు మార్మోగాయి. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- స్వగృహంపై జాతీయ జెండా ఆవిష్కరించిన కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి దంపతులు

**చింతపల్లి ఆగస్టు 15 నేటి దర్శిని :** స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్, చింతపల్లి మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హస్తినాపురంలోని తమ స్వగృహంపై శుక్రవారం ఆమె భర్త కంకణాల వెంకట్ రెడ్డితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె దేశ ప్రజలందరికీ 80వ



స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి కోరారు.

## నిడమానూరులో వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ



**నిడమానూరు, ఆగస్టు 15 (నేటి దర్శిని):** నిడమానూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న రక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రాంకీ కంపెనీ ప్రతినిధి మేరెడ్డి శ్రీరాంబాబు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు కొంతమేర పరిష్కారం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషరాజు సంధ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు బత్తులకోటి ప్రసాద్, గోగుల శంకర్, అనిత శీను, కమ్మల గిరి, మాజీ ఉపసర్పంచ్ శేషరాజు లక్ష్మీ నరేష్, కళ్ళు పురుషోత్తంరెడ్డి, చిలుముల శీను, సుంకరబోయిన కరుణాకర్, బొజ్జ పుల్లయ్య, ఐతరాజు వెంకటేశ్వర్లు, జక్కల శీను, శోభారాణి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ముఖ్య నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. రాంకీ ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## త్రివేణి కిడ్స్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


- "జై జవాన్ - జై కిసాన్" సందేశంతో దేశభక్తిని చాటిన విద్యార్థులు

**పటాన్ చెరు ఆగస్టు 15(నేటి దర్శిని)** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలో బీరంగూడ త్రివేణి కిడ్స్ పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను "జై జవాన్ -- జై కిసాన్" అనే దేశభక్తి ప్రధాన ఇతివృత్తంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత, గాయకుడు, జాతీయ సాహితి నంది అవార్డు గ్రహీత రాఘవేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ రక్షణలో సైనికుల పాత్రతో పాటు దేశ ఆర్థికాభివృద్ధిలో రైతుల కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా



విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో పాటు "జై జవాన్ -- జై కిసాన్" సందేశాన్ని ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. దేశభక్తి, ఐక్యత, జాతీయ స్ఫూర్తిని చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో దేశం పట్ల గర్వభావాన్ని నింపాయి. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సిఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్, క్యాంపస్ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముప్పారం ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు, దాతల చేయూత



**నిడమానూరు, ఆగస్టు 15 (నేటి దర్శిని):** నిడమానూరు మండలంలోని ముప్పారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు, దాతలు అండగా నిలిచారు. సుమారు రూ.50 వేల వ్యయంతో పాఠశాలలోని ఫస్ట్ క్లాస్ గదికి గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమానికి దాతలు తెలకపల్లి శంకర్, ఆలంపల్లి మైసయ్య (పోలీస్ హెడ్ కానిస్టేబుల్), భాస్కరి నాగేశ్వరరావు, ఆలంపల్లి ముసలయ్య కుమారుడు ఆలంపల్లి శ్రీను, ఊల్లెందుల శివకుమార్, ముడి రాజేంద్ర తదితరులు సహకరించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురారిశెట్టి రమేష్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు దాతలను శాలువాలతో సత్కరించి అభినందించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు.'

# ఎంపీ మల్లు రవి కి కాంగ్రెస్ నేతల స్వాగతం



**ఆమనగల్లు, ఆగస్టు15 (నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో శనివారం నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి కి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎంపీ మల్లురవికి ఆమనగల్ పట్టణం లోని హైదరాబాద్.. శ్రీశైలం జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, డిసిసి కార్యదర్శి మానయ్య,రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ నాయకులు కృష్ణానాయక్, కానుగుల దశరథం, ధనంజయ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ,శ్రీను నాయక్,శ్రీధర్,రాగ్య నాయక్,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్ హెచ్ఓ సంద. వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, ఆగస్టు15(నేటి దర్శిని);**
80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఆమనగలు పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సంద.వెంకటేశ్వర్లు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మువ్వన్నెల జెండా విశిష్టతను దేశ స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను ఆయన గుర్తు చేశారు.దేశభక్తి సేవా భావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్ రెడ్డి,ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు,పట్టణ ముఖ్య నాయకులు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# వస్త్ర సంఘం ఆధ్వర్యంలో రెపరెపలాడిన జాతీయ జెండా

● వస్త్ర సంఘం అధ్యక్షులు అవ్వారి కిష్టయ్య



**ఆమనగల్లు ఆగస్టు15(నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో వస్త్ర సంఘం ఆధ్వర్యంలో దేశ 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిపారు.ఈ సందర్భంగా వస్త్ర సంఘం అధ్యక్షుడు అవ్వారి కిష్టయ్య మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకొని,వారు చూపించిన బాటలోనే పయనించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గాజుల వెంకటేష్,పసుపుల సురేష్,గోజే సురేష్,గోదా సతీష్,శ్రీను,దోర్నాల రాము,నక్క శివకుమార్, రమేష్,దాస శ్రీను,రవి,నేటి దర్శిని కల్వకుర్తి ఇన్చార్జ్ అవ్వారి పాండయ్య, వసుంధర డ్రెస్సెస్,క్లాత్ మర్చంట్ గుమస్తాలు,తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగ ఫలితమే స్వేచ్ఛా స్వాతంత్ర్యం





**మిడ్జిల్ , ఆగస్టు 15 ( నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ... దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుతూ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది

# చైతన్య భారతి హై స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**● భారత దేశ ఖ్యాతి , గొప్పతనాన్ని చిన్నారులకు వివరించిన ప్రిన్సిపాల్**

**మిడ్జిల్,ఆగష్టు 15, (నేటి దర్శిని) :**
మిడ్జిల్ మండల కేంద్రంలోని చైతన్య పార్టీ హై స్కూల్ లో స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణను అందంగా అలంకరించగా, విద్యార్థుల సందడితో స్కూల్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యత, భారత రాజ్యాంగ గొప్పతనం, దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ఉన్న ప్రత్యేక ఖ్యాతి గురించి చిన్నారులకు చక్కటి సందేశాన్ని అందించారు. దేశం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవడంతో పాటు, భవిష్యత్‌లో దేశ అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. చిన్నతనం నుంచే పిల్లల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత, సోదరభావం, బాధ్యతాయుతమైన పౌరస్పృహను పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యతో పాటు మంచి విలువలు, సంస్కారం, మానవత్వం కలిగి ఉన్నప్పుడే విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. స్వీట్స్ అందుకున్న చిన్నారులు ఎంతో ఆనందంతో కేరింతలు కొడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో పాఠశాల ఆవరణ మొత్తం సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొని 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



హైదరాబాదులో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల ఆవరణలో జెండా ఎగరవేసిన కాలేజీ కరెస్పాండెంట్ వై. రాజేందర్ రెడ్డి

# అమరవీరుల త్యాగాల సాక్షిగా.. నల్లగొండను అగ్రభాగాన నిలబెడతా

**● నల్లగొండను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**







**నల్లగొండ, ఆగస్టు 15 (నేటి దర్శిని):**
అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నల్లగొండ జిల్లాను అభివృద్ధిలో తెలంగాణలోనే అగ్రభాగాన నిలబెట్టేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ తనకు ఊపిరి వంటిదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు తన శ్వాస ఉన్నంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**స్వాతంత్ర్యం అంటే బాధ్యత**

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని మంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం ఒక రోజు పండుగ జరుపుకోవడం కాదని, దేశ అభివృద్ధికి నిజాయితీగా పనిచేయడం, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని అన్నారు.

**పోరాటాల గడ్డ నల్లగొండ**

స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని మంత్రి గుర్తుచేశారు. నల్లగొండ అంటే పోరాటం, త్యాగం, తిరుగుబాటు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. చాకలి ఐలమ్మ, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం తదితర మహనీయుల పోరాట స్ఫూర్తి ఈ గడ్డకు గర్వకారణమన్నారు.

**ప్రజా సంక్షేమానికి పెద్దపీట**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, సన్నబియ్యం, ఆరోగ్యం, విద్య, రహదారులు, తాగునీరు తదితర రంగాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు 5.35 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.715 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. 1.99 లక్షల మందికి నెలకు రూ.51.28 కోట్ల పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. 17,873 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 4,360 ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. గృహజ్యోతి పథకం ద్వారా 2.56 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 38,403 మంది పేదలకు రూ.119.11 కోట్ల విలువైన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణాల ద్వారా 8.73 కోట్ల ప్రయాణాలకు రూ.408.20 కోట్ల ప్రయోజనం కలిగిందన్నారు. అదేవిధంగా 5.42 లక్షల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం, 81,279 కొత్త రేషన్ కార్డులు అందించినట్లు మంత్రి పేర్కొన్నారు.

**నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

నల్లగొండ పట్టణానికి 24 గంటల తాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.83 కోట్ల వాటర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని, అదనంగా రూ.300 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు రూ.20 కోట్లతో ఎన్‌ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.

**‘నా శ్వాస ఉన్నంతవరకు పోరాడుతా’**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం వదిలి ఉద్యమంలోకి వెళ్లిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల కోసం చేసిన పోరాటం, త్యాగమే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. “నల్లగొండ నా ఊపిరి. మీ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు నా శ్వాస ఉన్నంత వరకు పాటుపడతా. నల్లగొండ నీటి కష్టాలు తీర్చడంతో పాటు అభివృద్ధి బాటలో అగ్రభాగాన నిలబెట్టేందుకు నా సర్వశక్తులు ధారపోస్తా” అని మంత్రి అన్నారు. నల్లగొండను కేవలం పోరాటాల గడ్డగా కాకుండా అభివృద్ధిలో తెలంగాణకు ఆదర్శంగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. “అమరవీరుల త్యాగాల సాక్షిగా.. నల్లగొండను అగ్రభాగాన నిలబెడతానని మీ బిడ్డగా మాట ఇస్తున్నాను” అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్ డేట్ ఫిక్స్.. ఆసక్తికరంగా ఫస్ట్ లుక్





వైవిధ్యమైన కథలు, ప్రత్యేకమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ చిత్రానికి సంబంధించిన మేజర్ అప్‌డేట్‌ను మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విప్లవం సృష్టించడానికి కాకుండా, థియేటర్లలో పూర్తి స్థాయి నవ్వుల విప్లవాన్ని పంచడానికి 'కామ్రేడ్ కళ్యాణ్' వస్తున్నాడని చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 1990ల కాలం నాటి వింటేజ్ ఫ్లేవర్‌లో.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని మాడుగుల నేపథ్యంతో ఈ పీరియడ్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా, సత్య, ముక్కు అవినాష్‌తో పాటు పలువురు ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తుండగా, కోన వెంకట్ సమర్పిస్తున్నారు. వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, భాస్కరభట్ల సాహిత్యం సమకూరుస్తున్నారు. విభిన్నమైన మాస్ లుక్‌లో శ్రీవిష్ణు కనిపిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలను త్వరలోనే మరింత వేగవంతం చేయనున్నారు.



మతి పోగొడుతున్న సిరి


## రక్తపు మరకలతో త్రివర్ణ పతాకం కప్పుకుని..

### -సరికొత్తగా విజయ్ దేవరకొండ 'రణబాలి' పోస్టర్!



స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854--1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. "మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది.ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## కీర్తి నిజంగా వేరే లెవల్



కీర్తిసురేశ్ తెరపైనే కాదు. రియల్ లైఫ్‌లోనూ షార్ప్‌గా ఉంటారు. తనపై వచ్చే విమర్శలను తిప్పికొట్టడంలో ఆమె శైలి ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా ఆమె నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో భాగమైంది. ఆ సినిమాలోని ఓ ప్రత్యేక గీతంలో కీర్తి సురేశ్ నర్తించింది. ఈ విషయంపై ఓ యువతి.. అవకాశాలు లేక ఐటమ్ సాంగ్ చేసిందంటూ కీర్తి సురేశ్‌ని విమర్శిస్తూ తన ఇన్‌స్టాలో ఓ వీడియోని షేర్ చేసింది. పైగా 'ది ప్యారడైజ్' సినిమాను కన్నడ సినిమాగా ఆమె ఆ వీడియోలో పేర్కొన్నది. ఈ విమర్శపై కీర్తి సురేశ్ కూల్‌గా తనదైన శైలిలో సమాధానమిచ్చింది. 'ది ప్యారడైజ్'ని కన్నడ సినిమా అనడంపై 'వేరే లెవల్..' అంటూ కీర్తి సెటైర్ విసిరింది. 'చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్న తెలుగు సిని మా.. కన్నడ సినిమా కాదు' అంటూ కౌంటరిచ్చింది. అంతే.. సరిగ్గా చెప్పావ్ అన్నట్టుగా పలువురు నెటిజన్లు కీర్తి సురేశ్‌ని అభినందిస్తూ కామెట్లు పెడుతున్నారు

## ప్రతిరోజూ కొత్తగా ఉంది



అగ్ర నటి సమంత హాలిడే ట్రిప్‌కి రెడీ అవుతున్నారు. తన ప్రెగ్నెన్సీకి చెందిన ప్రతి క్షణాన్నీ ఆస్వాదించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారామె. ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సామ్.. తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. 'ఈ హాలిడేకు రెండు జతల బట్టలు మాత్రమే సర్దుతున్నా. నిజానికి నా దగ్గర చాలా డ్రెస్సులున్నాయి. కానీ అవేమీ ఇప్పుడు నాకు సరిపోవడం లేదు. అందుకే సరిపోయే రెండు జతలు మాత్రమే సర్దుతున్నా' అంటూ ఆ పోస్టులో పేర్కొన్నది సమంత.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడిన మాటలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ' 'అమ్మ' అని పిలిపించుకునే క్షణాలకోసం నేనెంతో పరితపిస్తున్నాను. నా బిడ్డను మోస్తున్నాననే అనుభూతి నా హృదయాన్ని ఆనందంతో నింపేస్తున్నది. ఈ ప్రయాణాన్ని ప్రతి క్షణం ఆస్వాదిస్తున్నా. నాకెందుకో ప్రతిరోజూ కొత్తగా ఉంది' అంటూ సమంత భావోద్వేగానికి లోనయ్యారు.

## ఆది సాయికుమార్ 'సైరాబాను' ఫస్ట్ లుక్ విడుదల.!

వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరించే హీరో ఆది సాయికుమార్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'సైరాబాను'. ఆసక్తికరమైన ప్రేమకథ, రంగులద్దిన పాత్రలు, కడుపుబ్బా నవ్వించే వినోదంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ఈ చిత్రంలో ఆది సాయికుమార్ సరసన బంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. A Fun-Filled Journey of Love, Faith & Destiny అనేది ఈ చిత్రానికి సంబంధించిన ట్యాగ్‌లైన్.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హీరో ఆది సాయికుమార్ సంప్రదాయ తెల్లటి దుస్తులు ధరించి, నుదుట విభూది, మెడలో రుద్రాక్ష మాలలతో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడుపుతూ కనిపించారు. ఆయన వెనుక కూర్చున్న హీరోయిన్ బంధవి శ్రీధర్ నల్లటి హిజాబ్ ధరించి, భుజాలపై చేతులు వేసి కూర్చున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ చూస్తుంటే ఇదొక విభిన్నమైన హిందూ-ముస్లిం ప్రేమకథా చిత్రమని స్పష్టంగా అర్థమవుతోంది. పోస్టర్ డిజైనింగ్ కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంది. ఒకవైపు ఆలయం, మరోవైపు ఇస్లామిక్ శైలి స్మారక కట్టడాలు ఉండటం రెండు భిన్నమైన సంస్కృతులు, విశ్వాసాల కలయికను అద్భుతంగా సూచిస్తోంది. జంట చుట్టూ ఎగురుతున్న తెల్లని పావురాలు శాంతి, ఐక్యత, ప్రేమ అనే సందేశాలను చాటుతున్నాయి. విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాలోని రొమాంటిక్ బ్యాక్‌డ్రాప్‌ను చక్కగా పరిచయం చేయడమే కాకుండా, ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలు ముందే మంచి స్పందనను రాబట్టాయి. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, శేఖర్ చంద్ర సంగీతం సమకూరుస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్‌ను పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను మేకర్స్ ప్రకటించనున్నారు.




Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365